# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా ఐదు దశల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 50 కోట్ల 72 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేందుకు వీలుగా అన్ని జిల్లాలకు ప్రత్యేక పోలీసు అధికారులను నియమిస్తూ పోలీసు డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.**
3. **హైదరాబాద్ నగరానికి సంబంధించిన వివిధ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణలో వానాకాలం సీజన్ నుంచే పంట సాగు చేసేవారందరికీ రైతు భరోసా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**
5. **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా బలపడిందని, ఈ ఉదయానికి తీవ్ర తుఫానుగా మారుతుందని ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.**

==========================

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఐదు దశల్లో పోలైన ఓట్ల సంఖ్యను కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నిన్న విడుదల చేసింది. మొత్తం 76 కోట్ల 41 లక్షల మంది అర్హులైన ఓటర్లలో 50 కోట్ల 72 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపింది. పోలింగ్ గణాంకాల వెల్లడిలో ఎలాంటి ఆలస్యం లేదని పేర్కొంది. నియోజక వర్గాల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల గణాంకాలను ఎన్నికల సంఘం తన వెబ్ సైట్‌లో పొందుపరిచింది. ఈ గణాంకాలను మార్పు చేయడం అసాధ్యమని స్పష్టం చేసింది. పోలింగ్ ముగిసిన తరువాత ఓటింగ్ శాతాలు పెరుగుతున్నాయని వస్తున్న వ్యాఖ్యలు అసత్య ప్రచారమని పేర్కొంది. ఎన్నికల వివరాల విడుదల ప్రక్రియ మొత్తం ఎటువంటి తేడా లేకుండా ఖచ్చితమైన, స్థిరమైన, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా జరుగుతుందని, ఎన్నికల ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరాయంగా కృషి చేయవలసిన గురుతరమైన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని స్పష్టం చేసింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేందుకు వీలుగా అన్ని జిల్లాలకు ప్రత్యేక

పోలీసు అధికారులను పోలీసు డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా నియమించారు. ఇందుకు సంబంధించి నిన్న ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 56 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, వీరిలో పల్నాడు జిల్లాకు అత్యధికంగా 8 మంది అధికారులను కేటాయించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన పోలింగ్, ఆ తరువాత జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక పోలీసు అధికారులను నియమిస్తూ హరీష్ కుమార్ గుప్తా నిర్ణయం తీసుకున్నారు. ప్రతి జిల్లాకు అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సున్నిత ప్రాంతాల్లో శాంతిభద్రతల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

---------------------------

హైదరాబాద్ నగరానికి సంబంధించిన వివిధ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కేవలం వర్షాకాలంలో మాత్రమే కాకుండా 365 రోజులు పనిచేసేలా వ్యవస్థను సంస్కరించాలని సూచించారు. నగరంలోని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం నుంచి ఒక్కో అధికారి బాధ్యత వహించేలా వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని.. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో వానాకాలం సీజన్ నుంచే పంట సాగు చేసేవారందరికీ రైతు భరోసా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన నిన్న హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ.. జులైలో ఎకరానికి 7 వేల 500 రూపాయల చొప్పున పెట్టుబడి సాయం రైతులకు అందుతుందని వెల్లడించారు. రైతుల నుంచి అఫిడవిట్ తీసుకుంటేనే కౌలుదార్లకు భరోసా సాయం అందిస్తామని స్పష్టంచేశారు. ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని.. వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా బ్యాంకుల నుంచి చిన్న, సన్నకారు రైతులందరికీ రుణసహాయం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి ఈరోజు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు సుమారు 2 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే పరీక్షలకు ఆంధ్రప్రదేశ్‌లో 26, తెలంగాణలోని 13 నగరాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు.

---------------------------

తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి రేపు ఉప ఎన్నిక జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మూడు జిల్లాల్లోని 34 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 4 లక్షల 63 వేల 839 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికకు సంబంధించిన ప్రచారం నిన్న ముగిసింది. ఇక్కడి నుంచి భారత రాష్ట్ర సమితి తరఫున గెలుపొందిన పల్లా రాజేశ్వర్ రెడ్డి.. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ శాసనసభ స్థానం నుంచి

పోటీ చేసి విజయం సాధించారు. ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో రేపు ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జూన్ 5వ తేదీన ఫలితం వెలువడనుంది.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ మీదుగా రింగ్ రోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకూ వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. కాగా.. తిరుమలలోని అక్టోపస్ భవనం వద్దనున్న సర్కిల్ నుంచి శిలాతోరణం సర్కిల్ వరకు శ్రీవారి భక్తులను ఉచిత బస్సుల్లో చేరుస్తున్నారు. గడిచిన 10 రోజుల్లో శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో దాదాపు 2 లక్షల 60 వేల మంది భక్తులు తిరుమలకు చేరుకున్నారని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

వేసవి సెలవులు ముగుస్తుండటంతో తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు నిన్న భారీగా తరలివచ్చారు. స్వామి వారి ధర్మ దర్శనానికి 3 గంటలు.. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు సమయం పట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని పుష్కరిణి ప్రాంగణం, వ్రత మండపం భక్తులతో కిక్కిరిసిపోయాయి.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నిన్న రాత్రి తుఫానుగా బలపడింది. ఈ తుఫాన్‌కు ఒమన్ దేశం సూచించిన 'రెమాల్'గా నామకరణం చేశారు. ఇది బంగ్లాదేశ్‌లోని ఖెపుపరాకు నైరుతి దిశలో, పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ దీవులకు దక్షిణ–ఆగ్నేయంగా, పశ్చిమ బెంగాల్‌లోని క్యానింగ్‌కు దక్షిణ–ఆగ్నేయ దిశలో కేంద్రీకృతమై ఉంది. రెమాల్ క్రమంగా ఉత్తరదిశగా కదులుతూ ఈ ఉదయానికి తీవ్ర తుఫానుగా మారుతుందని ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రోజు అర్ధరాత్రికి ఖెపుపరా, సాగర్ ద్వీపం మధ్యలో తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. ఆ సమయంలో గరిష్ఠంగా గంటకు 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది. మరోవైపు..

రాజస్థాన్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర సహా వేర్వేరు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు జల్లులు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈరోజు మోస్తరు వర్షాలు, ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. తుఫాన తీరం దాటే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని సూచించింది.

---------------------------

తెలంగాణలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో రోజూ 90 శాతానికిపైగా విద్యార్థుల హాజరు ఉండాలని విద్యాశాఖను ఆదేశించింది.

ఈ మేరకు 2024–25 కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండరును విడుదల చేసి, మార్గదర్శకాలు వెలువరించింది. ఈ మార్గదర్శకాలను తప్పకుండా అమలు చేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి సాయంకాలం 4 గంటల 45 నిమిషాల వరకు.. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 4 గంటల 15 నిమిషాల వరకు తరగతులు వరకు తరగతులు నిర్వహిస్తారు.

======================